

# నొమొష్కార భాణము లేక మైగాడ్! పేరేనా మార్చరా!

ఆయ, ఆయ. నమస్కారం, నమస్కారం. దయచెయ్యండి', మీకోసమే ఎదురుచూస్తున్నాను. పాత బాకీకోసం చిన్న నటుడిలా, కొత్త ఇనిస్టాలుమెంటు సొమ్ముకోసం ప్రొడ్యూసరులా, రయమున టయమున రాని హీరోయిన్ కోసం మిగతా జనాభాలా, పార్టీ

టిక్కెట్టు కోసం ఛాన్సు లేని ఎలక్షన్ కాండిడేటులా, ఈ ఉపమానాల అంతు కోసమీ్మలా, జీ(వి)తం కోసం భోర్డుస్కూలు మేస్టరులా అయన జీతంకోసవేఁ ఆయన తాలూకు అప్పులాళ్ళలా, మందుకోసం ధర్మాసుపత్రి రోగిలా, ఈగల కోసం పెన్సిలినుబుడ్డిలా, రైలు కోసం ప్రయాణీకుడిలా, సీతకోసం మోహన్‌లా, ఈ ఉపమానాల ముగింపు కోసం పాఠకుడిలా, 'ది యండ్' కోసం ఇటీవలి చిత్రాల ప్రేక్షకుడిలా, ఐక్యత కోసం ఆంధ్రుల్లా, విమర్శ కోసం మహాకవుల్లా, గు. అప్పారావుని ఆడిపోసుకునే అవకాశం కోసం అపహాస్య బ్రహ్మల్లా, మనియార్డరు కోసం హాస్టలు స్టూడెంటులా, డెంటుకోసం టాక్సిడెంటు కోసం పొగరుమోతు డ్రైవరులా, మంచి ఉపమానం కోసం మీలా, అర్హుడైన ప్రయోక్త కోసం ఉపమానంలా, తమపై సినిమావారి మోజు విరిగే రోజు కోసం శరత్కథలలా, చిద్గగనాంతాన గురు సాక్షాత్కారం కోసం విశ్వనాథగారిలా, రీమేక్‌కోసం పాత కథల్లా, సన్నదనం కోసం దేశవాళీ హీరోయిన్‌లా, చక్కదనంకోసం వాంపులా, నాయకుల చెవాకుల కోసం సెటైర్లు రాసేవాడిలా, ఈ పేరాగ్రాఫు ముగింపుకోసం పాఠకుడిలా, సరికొత్త కథలోంచి పుట్టవలసివున్న సరిపాత కథ కోసం మనలా, అప్పుకోసం అప్పారావులా, విడుదల కోసం లోభి జేబులో గుండుగల ఎడ్వర్డురాజు రూపాయిలా, నేను మీకోసం ఎదురుచూస్తున్నాను. మీకోసవేఁ ఎదురుచూస్తున్నాను.

ఆయ ఆయ రండ్రండి. నమస్కారం. మీకోసవూఁ ఎదురు చూస్తున్నాను. అయిపోయింది. కథ రడీగా వుంది. మార్పులు, కూర్పులు చేసి తీసి సిద్ధపరచాను. ఓకె చెయ్యడవేఁ తరవాయి. ఇండుపుకాయేసిన వరద బురద నీటిలా తేటగా ఉంది. ఎంత చిన్నపిల్లాడైనా--మాటలు రావాలనుకోండి--చక్కగా చెప్పగలడు. ఏ దేశంవాడైనా---భాష తెలిస్తే--ఇట్టే చెప్పేస్తాడు. ఏ ప్రేక్షకుడికి చెప్పినా, ఇది సినిమాకథ అని ఇట్టె గుర్తు పడతాడు. హిట్టవుతుందని నా మిత్రులెవర్నడిగినా చెప్తారు. నేనేనా ఆమాటే అంటాను.

చిత్తం. యావన్నారు? మార్పులు చెయ్యలేదనా? ఛంపేశారు. నేను ఛస్తే పాతకథని వాడతాన్టండీ. కొత్తదివ్వకపోతే నా గొప్పేవిటంట. అంతెందుకు. ఇందులో

మెలోడ్రామా సీన్సు వింటే చాలు మీకే తెలుస్తుంది. భోర్న ఏడుస్తారు. నా ఫ్రెండ్సంతా మొర్రోమని ఏడిచారు. బుచ్చెమ్మ బాబోయ్ అని ఏడిచింది! బుచ్చమ్మేమిటి ఇంటిల్లిపాది ఒకటే ఏడుపు....డామిట్. మీర్నమ్మరుగాని, ఎవరో పోయారుగామోసని చుట్టు పక్కలవాళ్ళంతా వచ్చి ఈ ఏడుపంతా కరుణరసం బాపతని తెలిసి ముక్కున వేలేసుకున్నారు--తౌజండ్స్ కాదు--ఫింగర్స్--వేళ్ళు. ఒక ప్రొడ్యూసరుగారు, ఈ సీను పట్టిగెళ్ళి వాళ్ళ సెట్టుమీద శాడ్‌సీనులో ఏడిసి నట్టేడుస్తున్న హీరోయినుకు వినిపించారు. అంతే త్రిల్లింగ్గా ఏడిచిందావిడ. కట్ అన్నా ఆగలేదుట. ఈ లెక్క నిహ గ్లిసరిన్ అవసరంలేదనీ, ఈ సీన్ని స్టుడియో ప్రాపర్టీగా ఉంచుతామనీ స్టూడియోలాయన అన్నాడు. గ్లిసరిను కంపెనీ సేల్సుమానొచ్చి బాబ్బాబు వారికిది అమ్మకు నీ పుణ్యం ఉంటుందని గ్లిసరిన్ లేకుండా, ఈ సీనూ వినకుండా స్వతంత్రంగా (పాల్టిక్స్‌కి సంబంధం లేదు) దు:ఖించి వెళ్ళాడు మీరొచ్చేముందు. అంత పవర్‌ఫుల్ సీను! హృదయాల్ని కదిలించి వేస్తుంది. హృదయాలేమిటి? ఇందాక అల్లా గోడని మేకు తీదామని ఎంత పీకినా కదల్లేదు. ఈ సీను వినిపించాను. ఊడి చక్కా వచ్చింది. పాలవాడు పాతబాకీకోసం గుమ్మంమీద కూర్చున్నాడు ఇచ్చేదాక కదల్నని. ఇది వినిపించాను. కదిలి కరిగి నీరైపోయి పాలలో కలిసిపోయాడు. ఆమధ్య ఎక్కడో (ఆంధ్రాలోనే లెండి) పనిచెయ్యని డాక్టర్లనీ, ఆస్పత్రుల్నీ, కారింజన్‌లనీ చూసి వో రైలింజను కూడా చెడిపోయి ఆగి కదలలేదు. దాన్దగ్గిర ఈ సీను టూకీగా వర్ణించేసరికి కదిలి సాగిపోయింది. అంతెందుకు, మనకథే 12 రీళ్ళయినా, ముందడుగు లేకుండా మొదలయిన చోటనే కదలక మెదలక కూర్చుంది. ఇది చూపించగానే పరుగెత్తింది. ఆవిడెవరో హీరోయిను "షూటింగుకు వేళ పూర్తి అయిపోతోంది రా తల్లీ" అని తెర వేలుపులంతా మొరపెట్టినా కదల్లేదు. ఇది చెప్పగానే ఏడిచి లేచ్చక్కా వచ్చింది. ఏం చెప్పమంటారు.

అయ్యా ఓ నమస్కారం పెడతానుగాని, ఇది మార్చమనకండి. మార్పులు చెయ్యకేం? చేశాను. మన పాతపిక్చరులో హీరో, హీరోయిన్‌లు సైకిళ్ళమీద వస్తూ డాషిచ్చుకుని ప్రేమలో పడతారు గదా. అందులో హీరోయిను ఎడమనుంచి, హీరో

కుడినుంచి వస్తారు. ఈసారి ఆ సీనుని తలకిందులు చేసి పారేశాను. హీరో ఎడమనించి వస్తే, హీరోయిన్ కుడినుంచి వస్తుంది. రెండు సైకిళ్ళకీ డాష్, క్లోజప్ కట్ లాంగ్‌షాట్, ట్రాలీ, కోపం, దానివెనుక ప్రేమ, డైలాగులు, హో(హో,హోహోలమీంచి, డ్యూయట్‌కి మిక్స్ చేస్తాం. టెక్స్ట్ కూడా మార్చేశాను. పాతపిక్చరులో వోహోహో చందమామా అని వుంది. ఇందులో?....వాట్? అహోహో చందమామా--థాంక్యూ థాంక్యూ. నాకు తెలుసు మీరు నావెల్టీ నెంకరేచ్చేస్తారని.

ఏం? అక్కణ్ణించి క్లాషు. ఈ హీరో ఇంత క్రితం ముగ్గురు పిల్లలతో డ్యూయెట్లు పాడి ఉంటాడు. అసలే ఆంధ్రా గదా. థర్టీ యియర్స్ వూరికే మడిగట్టుక్కూర్చుంటాడండీ? మనం రియలిస్టిగ్గా ఉండాలి. నా ఎస్టిమేట్ ప్రకారం ఇలాటి వోల్డ్ ఫ్లేమ్స్-అనగా ప్లాషుబాకు హీరోయినులు చచ్చు సంభావన వో అరడజనేనా ఉంటాయి. నన్నుబట్టి నా ఎస్టిమేటులో డిస్కౌంటిచ్చిరా ఓ ముగ్గురు ప్రేయసీమణులేనా ఉండి వుంటారు--ఏం. ఈ సైకిలు హీరోయిను యాక్సిడెంట్ తరవాత హీరో, ఆవిడా డ్యూయటు మొదలెడతారు. పల్లవి, చెరో చరణం తిరిగేసరికి ఈ పాతప్రియురాళ్ళు ముగ్గురూ హలో హలో అంటూ ఆ తోటలోని పాటలో జొరబడిపోయి అపశ్రుతి కలుపుతారు. చివరకా డ్యూయెట్ కాస్తా కోరస్‌గా మారిపోతుంది. నావెల్టీ కదూ. ఐదుగురినీ ట్రిక్‌షాట్‌లో తమాషాగా చూపించవచ్చు. రాసలీలలా నారీనారీ నడుమ మురారీ టెక్నికుతో తియ్యొచ్చు. నాలుగు హీరోల బొమ్మలతో అయిదుగురు. ఐ మీన్ నలుగరు హీరోయిన్‌లతో రకరకాల మోస్తర్లలో చూపించొచ్చు. హిట్టా హిట్టున్నరా? ఏవన్నారూ, సెన్సారువాళ్ళా? వాళ్ళ కత్తెర్లు, వాళ్ళ మధ్య సెకన్లు వదిలి హోరరు మీద పడ్డార్ట. ఏకలవ్యుడి కథలో గురుదక్షిణ సీను తీయించేశారట. రేప్పొద్దున్న సీతని రావణుడెత్తుకుపోయాడంటే బాగుండదని, ఇంకోటేదన్నా చేదామంటారు. అసలు బహుభార్యాత్వం పెట్టడం వల్ల పేచీలొస్తే. పోనీ ఆ సీన్ మటుకు ఫోక్‌లోర్--జానపదంలా తీదాం కలర్‌లో ! లేపోతే పిక్చరే ఫోక్‌లోర్ తీద్దాం. మీకు బాక్సాఫీసుసూత్రాలు కొరుకుడు పడ్డేదుస్మండీ. ఎంతసేపు కళకళ అని దేవుళ్ళాడతారు. జగదేకవీరుడికథ ఎందుకు హిట్టయినట్టూ? అతగాని జగదేకవీరత్వం ఏమిటి చెప్పండి. యుద్ధాలు చేశాడా? అంతా

పార్వతి మద్దత్తు. మరతని గొప్ప? ఐదుగుర్ని పెళ్ళాడడం. అంతేగదా. ఈ కాలంలో ఒక్కదాన్ని కట్టుకునే మన్లాంటివాళ్ళం వేగలేక సినిమా కథలంత జీవితాల్తో చస్తున్నాం. ఒక్క కిటికీలోంచి ఒక్క పెళ్ళాంమీద అపోహ పడితేనే 20 రీళ్ళు. ఇంక ఇద్దరు పెళ్ళాలమీద రెండు కిటికీ చిల్లుల్లోంచి రెండపోహలు పడి రెండు డైలాగులు రెండుసార్లు చెప్పి జోడు శాడ్ సాంగులు పాడి బతకడం అంటే చచ్చామే. నలుగురితో చావు పెళ్ళిలాటిదైతే, నలుగురితో పెళ్ళి చావులాటిదన్నాడో జ్ఞాని. తిరుపతి వెంకటేశ్వర స్వామి అంతటివాడు పద్మావతితో డ్యూయెట్లు మొదలెట్టేసరికి మహలక్ష్మి రావడంతో, వాళ్ళు యూ హూ మచ్ అనుకోడంతో హడలిపోయి, రాయి అయిపోయాడు గదా. ఈ కష్టం మనకి తెలుసు. ఏడుకొండల జేజెకూ తెలుసు. అసలు నాకీ అయిడియాకి ఇన్‌స్పిరేషను అందులోంచే వచ్చింది లెండి. ఎవరితోనూ అనకండి.

అందువల్ల సంసార సుఖం (?) అనుభవిస్తున్న వారంతా కూడా భళీ నలుగురు భార్యల్ని కట్టుకు వేగ సాహసించినవాడు--జగదేకవీరుడు అంటూ హీరో వర్షిపుచేసి మరీ వస్తారు మన పిక్చరుకి. అంచేత మనం సోషల్ తీస్తేనే మజా వుంది. మనుషులేమిటి, ఆ కొండమీది దేవుడుకూడా చూడడానికి వస్తాడు--ఈ వీరుడి గొప్పతనం ఎలాటిదీ అన్న కుతూహలం కొద్దీ మనం తిరుపతి ఫస్ట్ రిలీజిద్దాం.

చివర్ని శరత్కథ ఒకటి మిళాయిద్దాం. కామెడీ స్టోరీ లెండి. సీరియస్‌గానే చూపెడదాం. ఒక పక్కగా వస్తూ వుంటుంది. చివరికొచ్చేసరికి హీరోయిన్ విలన్ని పెళ్ళాడవలసి వస్తుంది. ఆవిడ లేచి పారిపోతుంది! హీరో ఛేజ్ చేస్తాడు. ఎందుకు? ఆవిడ్ని పట్టుకుని పెళ్ళాడ్డానికా? దొరగ్గానే చంపడానికా? సస్పెన్సు, అసలు ఎడిటింగులో తమాషా చేదాం. హీరో హీరోయిన్ని తరుముతున్నాడా? హీరోయిను హీరోని తరుముతుందా అన్నది కూడా తెలీకూడదు ఆడియన్స్‌కి. ఆవిడ మోటారు సైకిలుమీదా (నావెల్టీ.....నే చెప్పలే?) ఆయన మూడుచక్రాల సైకిలు మీదా (కామెడీ) వెళ్తారు.

ఏవన్నారూ? రీసెంట్ పిక్చర్‌లా ఉందంటారా. అఫ్‌కోర్సు. అది చూశాకే ఈ అయిడియా వచ్చింది. అందులో తరిమే సీను ఇంకా బాగా పెట్టచ్చుననిపించింది.

హీరోయిను, హీరో మటుకే ఉన్నారు మనదాంటో. అలాకాక, ఆ సీనులో కథా కమామిషూ చూసి ముందర అసలు కథకుడు శరత్‌బాబు లేచి ఈ కథ నాదికాదు బాబోయ్ అంటూ పరిగెడతాడు. ఆయనను చూసి నాన్నా అంటూ హీరోయిన్ లేచి పరుగెడుతుంది కారుమీద. ఈవిడ కారుమీదున్నా, ఆయన్ని అందుకోకుండా ఎడిటింగ్ ఏర్పాటు చేస్తామనుకోండి. ఏం? ఆమెకోసం హీరో వెనకాల సైకిలుమీద పరుగెట్టుకెళ్ళి కారును ఆపుతాడు. అంతలో హెలికాప్టరు మీద దర్శకుడు (నావెల్టీ) వచ్చేసి ఇది ఆఖరి రీలని, ఇంక రెండొందల అడుగులు కూడా లేదని చెప్పి, సెట్‌కు తెచ్చి పెళ్ళి చేస్తాడు. ఎ స్టోరీ ఇన్ ఫోర్త్ డైమన్షన్ చివర్ని అంతా కలసి ముసలాయన్ని కూకలెయ్యొచ్చు. ఇది మీదని ఎవర్చెప్పారు? అసలీ సెట్టుకి మీరెందు కొచ్చినట్టు? అవటాని.

నే ననే దేవిటంటే మన పిక్చరులో కూడా ఈవైపు కామెడీ పెడదాం. ఏవంటారూ! నచ్చలేదా?

పోన్లెండి. అలాగేకానీండి, మీ పాతపిక్చర్ కథనే మళ్ళీ తీద్దాం. ఒక్క రిక్వెస్టు, ఈసారి పిక్చరుపేరు మారుద్దాం. ఆ? అదీ వద్దా? సెంటిమెంటా? రైటర్నే మారుస్తారా? మైగాడ్!

అయ్యా ! మీకో నమస్కారం.

